# అరటిపువ్వు సాములారు



ఊళ్లోకి సాములారు వచ్చారు. పల్లకీలో వచ్చారు. శిష్యగణం, దేవతార్చన, వంట సామానూ వేరే వాహనాల్లో దిగాయి.

సాములారు ఒక పెద్దింట్లో దిగారు. "వాక్శుద్ధి ఉందట, చాలా నిరాడంబరం గారంట" అని చెప్పుకుంటుంటే —"మరి ఆర్భాటంగా పల్లకీలో దిగాడేం" అన్నాడొక హేతువాది.

శ్రీరమణ

"అది శ్రమదానోద్యమానికి తనవంతు కర్తవ్యంగా స్వామి పల్లకీ ఎక్కారు. అంతా పల్లకీలు మోసేవారైతే, ఇహ ఎక్కేవారెవరుంటారు?" అంతారార్థాన్ని వివరించాడొక నమ్మినబంటు.

టెంకాయలు, వంకాయలు, పీతాంబరాలు ఊరి జనం ఇవ్వబోతే, ఆయన మౌనంగా తిరస్కరించారు. స్వామి అరటిపూలు తప్ప మరేమీ స్వీకరించరని వదంతి వ్యాపించింది. మరుక్షణం అరటిపూలు పావురాళ్లలా వచ్చి స్వామి ముందు వాలాయి. సాములారు కొలువు తీరారు. భక్తులంతా ఆపన్నులై, ఆసక్తులై కూచున్నారు. గుంపులోంచి ఒక భక్తుణ్ణి సైగతో పిలిచి పాదాల దగ్గర చోటిచ్చారు. అంతా నిశ్శబ్దం —గాంభీర్య నిండి ఉంది.

సాములారు గుట్టలోంచి ఒక అరటి పువ్వు తీసి భక్తుడికి ఇచ్చారు. భక్తుడు బాంబు అందుకున్నంత భయంగా వణుకుతున్న చేతులతో అందుకున్నాడు.

"దీన్ని ఒలవరా, వత్సా!" అన్నారు మందహాసంతో.

భక్తుడు గజగజ వణుకుతూ అరటిపువ్వు డొప్ప ఒలిచాడు. ఆపమన్నట్లు సైగ చేసి, భక్తజనాన్ని తాపీగా ఒకసారి వీక్షించి, "చూశారా, ఇవన్నీ కర్మ శేషాన్ని పూర్తిచేయక అడుగున పడి ఉన్న పూతలు. ఈ పైన కప్పుకున్న రేకు ఉన్నదే, అదే మాయ! ముందు దాన్ని తొలగించుకోవాలి. తదుపరి అత్తంగా పెనవేసుకున్న పూతని విడగొట్టాలి. అవే భవబంధాలు! చూశారా, ప్రతి పూతలో దొంగ, బూచాడు అనే రెండు చేదు విషయాలుంటాయి. అవే రాగ ద్వేషాలు. వాటిని విధిగా త్యజించవలె!" భక్తుడితో వాఖ్యానుసారంగా తంతు నడిపిస్తున్నారు. భక్తులు ఉత్కంఠతో గమనిస్తున్నారు.

"వత్సలారా! ఈ లౌకిక జగత్తులో ఉండే జీవి అరిషడ్వర్గాలకూ లోబడి కనరెక్కుతుంది. అందువల్ల దానిని మజ్జిగ అనే పరిజ్ఞానంతో శుద్ధి చేయాలి."

సోదాహరణ వివరణకి భక్తులు మైమరిచిపోతున్నారు. వైరాగ్యం వారిని ఆవరించి ఓహోకారాలు చేస్తున్నారు. తన్మయత్వంతో దణ్ణాలు పెడుతున్నారు.

అరటి పువ్వు ఒలవగా, ఒలవగా చిక్కి చిన్నదై బుడిపెలా తేలింది.

"హరోం హరహర! ఇదిగో శివలింగం ఆవిర్భవించింది! హరహర మహాదేవ!" — స్వామి భక్తి ఆవేశంలో అంటూంటే భక్తులంతా వంత పలికారు.

ఆ శివలింగాన్ని పెద్ద పళ్లెంలో పెట్టించి, ఒలిచిన అరటి పూవుతో పూజ చేయించారు. మజ్జిగతో అభిషేకం చేయించారు. పసుపుతో అర్చన చేయించారు.


"ఇప్పుడు చెప్పేది సావధానచిత్తులై వినండి!

"ముందుగా నానబెట్టిన శెనగపప్పు, అనగా అది పూర్వజన్మ సుకృతంతోపాటు చిటికెడు అనుభవ క్షారాన్ని పట్టినంత మమ—కారాన్ని వేసి మొత్తాన్ని మధించి ముద్ద చేయండి. అగ్నిదేవుని ఆవాహన చేసి మనసనే బాణలిలో మానవత్వమనే నూనె పోయండి. ఆ ముద్దని చిట్టిగారెలుగా రెండు చేతులా తట్టండి. తట్టేవేళ హరినామ సంకీర్తన చేస్తూ తాళయుక్తంగా తట్టండి! భక్తులారా! తట్టినకొద్దీ తరిస్తారు. పరిపక్వమయ్యాక అంటే బాగా వేగాక ప్రసాదంగా స్వీకరించి, ఆహారమయకోశం నింపండి!"

అరటి పువ్వు వడలు తిని అంతా 'ఓం' అని తృప్తిగా తేన్చారు.

పూజా సభ పరిసమాప్తి అయింది. భక్తులు సాములారి జ్ఞానానికి ముగ్ధులై రొట్టలు

# అనిశ్చలానందం



ప్రతి ఉదయమూ ఓ నిరాసక్తత పుట్టడం చూస్తూనే ఉన్నా
నా పిడికిలి నుండి తప్పించుకున్న స్వేచ్ఛ
నాపై ఒక భారాన్ని వొదిలి వెళ్లింది
ప్రపంచాన్ని మోయడం మానేస్తేగానీ ప్రపంచం మనల్ని మొయ్యదు
సాపేక్షం చుట్టూ నిరపేక్షం తిరుగుతుంది
అభివృద్ధి గాడిదల్ని మేపుతుంది
ముందు చూపూ వెనక చూపూ కలిసిపోతాయి

ఊహల విస్ఫోటనంలో నైరూప్య విషాదం చిక్కదు, దొరకదు
అర్థరాహిత్యం వ్యాపిస్తూ పోతే నిశ్శబ్దం చిగురిస్తుంది
శరీరపు అంచులదాకా వెళ్లి మాయమైన మనసు మళ్లీ ఎప్పుడొస్తుందో
నాలుగు రుతువుల్ని కుండీలో పెట్టి సంతృప్తి పడలేను
వందేళ్ల గుండా నడిచి ఎక్కడికని వెళ్లను?

ఒక చూపు తాకి వెళుతుంది
అమూర్త స్పర్శ ఆజన్మాంతం వెంటాడుతుంది
ఒక పాట కొన్ని పూలు రాల్చి వెళుతుంది
పరిమళం పునర్జన్మదాకా వదిలి పెట్టదు
పువ్వు నిస్తూ ఎవరో చేసిన గాయం
గులాబీ జార్చిన కన్నీటితో ఓదార్పు పొందుతూనే ఉంది
నా ఆత్మకథని మోస్తూ నడుస్తున్న నా అడుగులు
భారంగా కదుల్తాయి
పాదాలు మెల్లగా భూమిలోకి దిగబడి నేను పాతాళంలో పడిపోతాను

సౌభాగ్య

---

వేసుకుంటూ బయలుదేరారు.

గుమ్మం దాటాక 'మద్యవైస్కు'డన్నాడు— "భక్తీ ముక్తీ ఏమోగానీ, సాములారి పుణ్యమా అని నాలో జ్ఞానదీపం వెలిగింది. అరటి పూవు రెక్కల్లో ఓ క్వార్టరు చుట్టుకుని పబ్లిగ్గా అబిడ్స్‌లోంచి వెళ్లినా అడిగావాడుండు — సేఫ్టీ అండ్ డిగ్నిటీ!"

* * *

పల్లకీ స్వా పరివారంగా ఇంకో ఊళ్లో ఆగింది. ఊరు ఊరంతా అరటి పూలు వాల్లాడిపోయాయి. సభ తీరిన స్వామి ఓ అరటి పువ్వు చేతిలో పట్టుకుని, "ఏమిటిది?" అని అడిగారు.

"అరటి పువ్వు, స్వామీ!" అన్నారు సభికులు ముక్తకంఠంతో.

స్వామి కొంటెగా నవ్వి, "కాదు, మీ అజ్ఞానం! ఇది విష్ణుమూర్తి శంఖం. సాక్షాత్తూ పాంచజన్యం! దీని రూపు రేఖలు చూస్తుంటే మీకు శంఖం స్ఫురించడంలేదా?" అని గద్దించారు.

'ఔ'నన్నట్లు తలలూపి లెంపలేసుకున్నారు.

"అసలు దీని వర్ణం తెలుపు. ఆ నీల మేఘశ్యాముని వెన్నంటి ఉండి ఉండి నీలవర్ణానికి మారింది. అమ్మవారి సాంగత్యంలో కుంకుమలు అద్దుకుని రవ్వంత ఎరుపు కలిసింది!"

భక్తులు పరవశించిపోయారు. అరటిపువ్వులో వైకుంఠం చూశారు. అక్కడి అరటి పూలన్నీ శంఖాలై ఓంకార ఘోష చేస్తున్నట్టుంది.

స్వయంగా ఒలిచారు.

"ఏమిటివి?"

"పూతలు."

"కాదురా, మూర్ఖా! శంఖంలో నాదాలు. ఒలుచుకుంటూ వెళితే నిక్షిప్తమైన నాదాలు ప్రత్యక్షమవుతాయి. ఇవిగో, ఇవి శ్రుతులు. ఇవి మెట్లు. ఇవి స్వరాలు, ఇవి రాగాలు —ఓంకారం నుంచి ఘీంకారందాకా ఆ స్వరాలను ఆస్వాదించండి! అరటి పువ్వుతో ఆధ్యాత్మిక శంఖం పూరించండి!"

"స్వామీ! మరి దొంగ, బూచాడు మాటేమిటి?"

"అవి అపశ్రుతులు, నాయనా! అవి పాంచజన్యంలో ఉండవు. పార్లమెంటులోనూ, అసెంబ్లీలోనూ ఉంటాయి."

"చిత్తం, స్వామీ!"

* * *

సాములారు చెప్పిన సామ్యం చెప్పినచోట చెప్పకుండా చెప్పుకుపోతూ మెప్పు పొందుతున్నారు. ఆయన సూక్తులు ఆనోటా ఆనోటా వినిపిస్తున్నాయి.

"అరటి ఒకే ఒక పూవు పూస్తుంది జీవితకాలంతో. ఇందులో కుటుంబ నియంత్రణ అంతరార్థం నిక్షిప్తమై ఉంది.

"అరటి పూల దొన్నెల్లో దీపాలు వెలిగించుకోండి. కరెంటు కోతను అవలీలగా అరటిలీలగా అధిగమించండి.

"ఇంటిల్లపాదీ అరటిపూలు ఒలుచుకోండి —శ్రమదానంద కందళిత హృదయార విందులు చేసుకోండి.

"అధర్వణ వేదం అరవై ఒకటో పనసలో అరటి పువ్వు నుంచి విద్యుత్తు పుట్టించే సూత్రం ఉంది. ఇది నాకు తెలుసు, ఆంజనేయస్వామికి తెలుసు. వారు లంకలో మొదట అరటి చెట్లను ధ్వంసం చేసి, ఆ పువ్వుని తోక చివర తగిలించుకుని —తద్వారా విద్యుత్కణాలు సృష్టించి లంకా దహనం చేశారు.

---




## లాభం

"కారు బాగుచేయడానికి అయిదు వేల రూపాయలు వసూలు చేశావు. అయినా తొయ్యాలంటావు. మరి రిపేరు చేసి లాభం ఏంటయ్యా, మోకానిక్కూ?"

"మీరు కారు తెచ్చినప్పుడు ముగ్గురు మనుషులు తొయ్యాల్సి వచ్చేది. ఇప్పుడు ఒక్కరు చాలు, సార్!"

వి.వి.సీతారామదాసు (గుంటూరు)



# కవిమనసు

విన్నకోట రవిశంకర్



పాపులే గదా, పశ్చాత్తాపంతో
పరలోకపు తలుపులు తడుతున్నది
పతితులే గదా, చెదరని పట్టుదలతో
మరల మరలా నిచ్చెన మెట్లెక్కుతున్నది
పదే పదే తమ అంతరంగాల్ని కడుక్కొనేగదా, కవులు
పద్యాలు సృష్టిస్తున్నది.

పరమ పవిత్ర మందిరమైనా బూజుపట్టడం సహజం.
తళతళలాడే అద్దం మీద
దుమ్ము తెరలా కమ్ముకోవడం సహజం.
దులిపి, తుడిచే ధైర్యమున్నవాడే కవై
నలుగురికీ దారి చూపిస్తాడు.

చిరునవ్వుల వరి అన్నం ఎవరూ పిలిచి వడ్డించరు
నిష్కల్మషమైన మాటల్ని పుష్పాలుగా ఎవరూ సమర్పించరు.
ఎవరే క్లేశాన్ని దయతో అందించినా

కవి మౌనంగా స్వీకరిస్తాడు
పిదప, ప్రేగుల్ని తీసి ప్రక్షాళన చేసుకొన్నట్టుగా
పద్యాలతో మనసుని పరిశుభ్ర పరచుకొంటాడు

చిరంతన చింతలు
నిరంతరం ఈ చెట్టుకొమ్మపై వచ్చి వాల్తాయి
ఏ ముంగిట్లో దురదృష్టపు అడుగు చప్పుళ్లైనా
ఈ గదిలో ముందు ప్రతిధ్వనిస్తాయి

ఎక్కడెక్కడి శోకాలూ
ఈ తీగెల మీద గొంతు సవరించుకొంటాయి
ప్రపంచ దుఃఖంతో మమేకమై కరిగిపోయాకే
పద్యం రూపుదిద్దుకొంటుంది.

---

"ఫ్లోరీ థెరపీతో సమస్త వ్యాధులనీ, మన దేశ ఆర్థిక పరిస్థితినీ బాగుచేయవచ్చు."

స్వాములారి పాపులారిటీ పంచాయతీల నుంచి కార్పొరేషన్‌ల స్థాయికి ఎదిగింది.

నగరంలోకి స్వాములారు విచ్చేశారు. బడాబడా భక్తులు, విదేశీయులు, సినిమా స్టార్లూ, నాయకులూ, ఐఏఎస్‌లూ, ఐపిఎస్‌లూ, ప్రెస్ రిపోర్టర్లూ, టీ.వీ. కెమెరాలూ, ... ఓ అంతా కోలాహలం — గెలలతో సహా అరటిపూలు దిగాయి.

"ఏమిటిది?" అన్నారు స్వామి.

"చక్కెరకేళి" అన్నారు.

"కాదు, రాజకీయ కేళి" —అని చిరునవ్వు వారిపై విసిరి తన చమత్కారానికి తానే మురిసిపోయారు.

కాసేపు మౌనం. సభంతా నిశ్శబ్దం.

"చూడండి, నాయనలారా!

"ఎమ్మెల్యేలందరూ మంత్రులు కానట్లే పూతలన్నీ పళ్లు కావు. చూశారా పై అత్తం ... కర్మ సాఫల్యం వల్ల ఫలవంతమైంది. ఇది ముఖ్యమంత్రి వారి కుటుంబ సభ్యులూ, రెండోవరుస కాబినెట్ వర్గం —దిగినకొద్దీ కార్పొరేషన్ ఛైర్మన్లూ, పార్టీ ప్రముఖులూ — ఇంకా దిగువన మునిసిపాలిటీ పదవులూ, మండలాధీశులూ —మిగిలినవాళ్లు పువ్వులో పూతల్లో ఉంటారు."

"అయితే మరి దొంగ బూచాడు ?"

"ఇక్కడ రూఢి అర్థమే చెప్పుకోవాలె. దొంగంటే దొంగే. బూచాడంటే బూచాడే."

"కులం, ప్రాంతం, పార్టీ, ముఠా —ఇవన్నీ వినియోగించుకుని వడలు వేసుకోవాలి. సామాన్యుల సమస్యలు సదా సలసల కాగుతూ ఉంటాయి కదా! వాగ్దానాల ఘుమఘుమలు సృష్టించడం సులువే కదా!"

అరటిపండు ఒలిచినట్టు సెలవిచ్చారు, స్వామీ!

"మరి, మా టీ.వీ. ప్రేక్షక శ్రోతలకి మీరేమైనా సందేశం ఇస్తారా?" అని అడిగాడొకాయన —లైటు మొహంమీద వేస్తూ.

స్వామి న్యూస్ రీడర్‌లా నవ్వి, "టీ.వీ.కీ అరటి పువ్వుకీ తేడా లేదు. ఇక్కడ ఒలుస్తాం, ఇక్కడ ఛానెల్స్ మారుస్తాం. దొంగా బూచాడు —మామూలే!" అన్నారు.

"నా దొక్క ప్రశ్న —ఇన్నాళ్లుగా నేను ఆధ్యాత్మిక, సాంఘిక, రాజకీయ కోణాలనుంచి ఈ అరటిపువ్వు వేదాంత ప్రవచనం చేస్తున్నాను కదా —దీని సారాంశం మీకెలా తోచింది?" అన్నారు.

సభంతా కాస్సేపు నిశ్శబ్దం ఆవరించింది.

"తమరికి అరటిపువ్వు వడలంటే చచ్చేంత ఇష్టమని ..." —గుంపులోనుంచి ఒక కంఠం పలికింది.

స్వామివారు ఖంగు తిన్నారు. సభ ఖాళీ అయింది.

శిలా ప్రతిమలా నిలబడి ఉన్న స్వామివారిని ఒక భక్తురాలు సమీపించి — "స్వామీ!" అంది.

"ఏమీ?" అన్నారాయన పరధ్యానంగా.

"తమరు అనుగ్రహిస్తే మీ అరటిపువ్వు సిద్ధాంతాలూ, మీ జీవిత చరిత్రనూ గ్రంథస్థం చేసి ఏడుకోట్ల ఆంధ్రులకు అందించాలని ఉంది. మీ పాదాల చెంత అరటి పువ్వంత చోటిస్తే ..." అన్నదావిడ వినయంగా.

సాములారు ఒక్కసారి షాకు తిన్నట్టై, "అమ్మో! అది మాత్రం వద్దు!" అంటూ పాంకోళ్లు చేత పట్టుకుని పరుగు లంకించుకున్నారు.

(1996 భోగినాడు ఆంధ్రాబ్యాంకువారు నిర్వహించిన హాస్యవల్లరి కోసం రాసినది.)

---

## పునశ్శంకితం

దీనినిన్నీ సభాముఖంగా కాకుండా పత్రికాముఖంగా సమర్పించడానికి విశేష కృషి చేసిన విశిష్ట మిత్రునికి పునశ్శంకితం.

ఇట్లు

శ్రీరమణ
రమణ